# సురాజ్యం

## ఉద్యమ పత్రిక

5

2012 నవంబర్




## ప్రముఖుల భాగస్వామ్యంతో విస్తరిస్తున్న సురాజ్యం

## హైదరాబాద్‌లో మహిళా రౌండ్‌టేబుల్



# వినుకొండలో విద్యార్థుల సురాజ్య ప్రతిజ్ఞ



# ప్రజా మున్సిపల్ కౌన్సిళ్లను ఏర్పాటు చెయ్యండి

## కార్యక్రమాల నిర్వహణకు కొన్ని మార్గదర్శకాలు

### I 1. ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటు

ప్రస్తుతం మున్సిపాలిటీలలో ప్రజాప్రతినిధుల పాలన లేదు. ఎన్నికలు ఇప్పుడు జరిగే అవకాశమూ లేదు. ప్రజా సమస్యలు పట్టించుకునే ప్రజాప్రతినిధులు లేనందున సురాజ్య కమిటీ చొరవ తీసుకుని ప్రజా మున్సిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చెయ్యాలి.

**ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఛైర్మన్ మరియు అధ్యక్షవర్గం**

– సురాజ్య ఉద్యమ కమిటీ సమావేశమై ప్రజా మున్సిపల్ కౌన్సిల్‌కు ఒక ఛైర్మన్‌తో పాటు అధ్యక్ష వర్గానికి పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీ అధ్యక్షులతో పాటు మరో నలుగురైదుగురు పెద్దలను గుర్తించి, వారితో సంప్రదించి తుది జాబితాను రూపొందించుకోవాలి. ఇందులో మహిళలకు, ఇతర తరగతులకు ప్రాతినిధ్యం వుండేలా చూడండి.

**ఆహ్వానిత సభ్యులు :** ఈ ప్రజాకౌన్సిలుకు మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లను, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను మాజీ మున్సిపల్ కమిషనర్లు లేదా ఇంజనీర్లు, మేనేజర్ల వంటి వారిని ఆహ్వానిత సభ్యులుగా పెట్టుకోవాలి.

**ప్రజాకౌన్సిలర్లు :** ప్రతి వార్డుకీ ఇద్దరు సభ్యులు అందులో ఒకరు మహిళ వుండేలా ప్రజా కౌన్సిలర్లను ఏర్పాటు చేసుకోవాలి. ఆయా వార్డులలో స్థానిక సమస్యల మీద కృషి చేస్తున్న వారు, లేదా పని చెయ్యాలన్న ఆసక్తి గలవారి నుండి ఎంపిక చెయ్యాలి.

**ప్రజాగేలరీ :** మున్సిపల్ వ్యవహారాలలో ఆసక్తిగల వారిని వివిధ రంగాల ప్రతినిధుల్ని ప్రతి సమావేశానికి ప్రజాగేలరీకి ఆహ్వానితులుగా పిలుచుకోవాలి.

ప్రజాకౌన్సిల్ ఏర్పాటు తేదీని, ప్రదేశాన్ని ముందుగా నిర్ణయించి కరపత్రం ద్వారా ప్రచారం చేసి, అందరికీ ఆహ్వానాలు పంపి తొలి ప్రజాకౌన్సిల్ సమావేశం నిర్వహించి లాంఛనంగా ఈ ప్రజా మున్సిపల్ కౌన్సిల్ పేర్లు ప్రకటించాలి. ఈ ప్రజాకౌన్సిల్ బృందాన్ని రాజకీయాలకి అతీతంగా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న లేదా ఆసక్తిగల వారితో ఏర్పాటు చెయ్యాలి.

### 2. ప్రజా మున్సిపల్ కౌన్సిలు నిర్వహించే కార్యకలాపాలు

1. ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం కావాలి.
   ఉదా: ప్రతినెలా 1-15 తేదీలు లేదా మరొక తేదీలు నిర్దిష్టంగా నిర్ణయించి ప్రకటించాలి.
2. ప్రతి సమావేశంలో కనీసం ఈ క్రింది మూడు అంశాలతో ఎజెండాను రూపొందించుకోవాలి.
   1. మున్సిపాలిటీల సాధికారత సమస్యలు
      (74 రాజ్యాంగ సవరణలోని ఒక అంశంపై వివరణ – చర్చ)
   2. మన ఊళ్లో వసతులు, మానవాభివృద్ధి, సిటిజన్స్ ఛార్టర్లలో ఏదో ఒక అంశంపై నివేదిక – చర్చ
   3. ప్రజా కౌన్సిలర్లు తమ వార్డులలో సమస్యల ప్రస్తావనలు, విజ్ఞప్తులు

**3.** సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల్ని క్రోడీకరించి స్థానిక మున్సిపల్ అధికారులతో ఆ సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలి.

ముఖ్యమైన సమస్యలు వెలుగులోకి తేవడానికి మున్సిపల్ ఛైర్మన్, అధ్యక్ష బృందం, ప్రజా కౌన్సిలర్లు ఆయా ప్రాంతంలో క్షేత్రసందర్శనలు చెయ్యాలి.

**4.** ఈ ప్రజా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు, ఎజెండా రూపొందించడానికి, చర్చకు వచ్చిన సమాచారాన్ని

క్రోడీకరించడానికి, మెమోరాండాలు రూపొందించడానికి, క్షేత్ర సందర్శన ఏర్పాట్లు చెయ్యడానికి సురాజ్య కమిటీ ఒక వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. కొంత అనుభవం గల వారిని దీనికి కన్వీనరుగా పెట్టి ఈ కార్యక్రమం సజావుగా జరగడానికి ఏర్పాట్లు చెయ్యాలి.

**అక్టోబరు 15-20 వరకు మన ఊళ్లో సురాజ్యంపై కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం, పట్టణ కూడళ్ళలో సురాజ్యం ఫ్లెక్సీలు**

**అక్టోబరు 25 వరకు తొలిదశ వలంటీర్ల నమోదు**

**వలంటీర్ల ఆసక్తినిబట్టి 5 బృందాలుగా ఏర్పాటు**

**బృందాలవారీగా వేర్వేరు శిక్షణ - గైడ్ చెయ్యగల వారితో నిర్దిష్టంగా బృందాల ఏర్పాటు**

## II జన లోకాయుక్త ఏర్పాటు (మన ఊళ్లో అవినీతి)

1. సురాజ్య ఉద్యమకమిటీ సమావేశమైన పట్టణానికి ఒక జనలోకాయుక్తను ఏర్పాటు చెయ్యాలి. ఇందులో 10, 11 మందిని సభ్యులుగా చేసుకోవచ్చును.
రిటైర్డ్ జడ్జీలు, సీనియర్ న్యాయవాదులు, రిటైర్డ్ పోలీసు ఉద్యోగులను భాగస్వాములను చెయ్యాలి.
వీరిలో ఒకరిని జన లోకాయుక్త అధ్యక్షులుగా మిగిలిన వారిని న్యాయబృందంగా ప్రకటించాలి.

2. జన లోకాయుక్త ప్రతి 15 రోజులకు సమావేశం అవుతుంది. (ఒక వారంలో ప్రజా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగితే మరో వారంలో జన లోకాయుక్త సమావేశం జరిగేలా తేదీలు నిర్ణయించుకోవాలి.)
ప్రభుత్వ సేవలు, పథకాలు, ఇతరత్రా అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తుంది. ఈ సమావేశంలో వాటిపై ఫిర్యాదులను వింటుంది. అవసరమయితే బహిరంగ విచారణ నిర్వహిస్తుంది. ప్రాధమిక సాక్ష్యాధారాలున్న కేసులను నిర్ధారించి సంబంధిత నేర పరిశోధన విభాగాలకు, అధికారులకు తగిన చర్యలు నిమిత్తం పంపిస్తుంది. బాధితులకు సత్వరన్యాయం జరిగేలా సంప్రదింపులు జరుపుతుంది.

3. జన లోకాయుక్త బృందానికి తోడ్పాటునివ్వడానికి సురాజ్య కమిటీ ఒక వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి ప్రజా ఫిర్యాదుల సేకరణకు, విచారణకు, తదుపరి చర్యలకు జన లోకాయుక్తకు తోడ్పాటునిస్తుంది.

## III ముఖ్యమైన ఇతర బృందాలు

**1. మన ఊళ్లో పౌర వసతులు :** సురాజ్య ఉద్యమ కమిటీ సమావేశమై దీనికి ఒక కన్వీనర్‌నీ వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, లైట్లు పరిస్థితిపై ఆయా వార్డు ప్రజా కౌన్సిలర్ల తోడ్పాటుతో సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించాలి. తక్షణం స్పందించాల్సిన సమస్యలను సురాజ్య ఉద్యమ కమిటీ దృష్టికి తేవాలి. ప్రతి వార్డు స్థాయిలో 1000 రూపాయల తలసరి గ్రాంటు ఆధారంగా ఒక సూక్ష్మ ప్రణాళికను స్థానికుల భాగస్వామ్యంతో రూపొందించాలి. ప్రజా ఫిర్యాదుల బాక్స్‌లను ప్రధానమైన చోట్ల ఏర్పాటు చేసి ప్రతి రోజు వాటిని సేకరించి తగు చర్యలు నిమిత్తం మున్సిపాలిటీకి నివేదించే ఏర్పాటు చేసుకోవాలి.

**2. మన ఊళ్లో పౌరసేవలు :** సురాజ్య కమిటీ ఏర్పాటు చేసే ఈ బృందం సిటిజన్స్ ఛార్టర్ల అమలు కోసం కృషి చెయ్యాలి. వీలైన పట్టణాలలో పౌరసేవాకేంద్రాన్ని ఏర్పాటు చెయ్యాలి. అలాగే మున్సిపాలిటీకి సంబంధించి సమాచార హక్కు చట్టం ప్రకారం విధిగా వెల్లడించాల్సిన అంశాలు అందరికీ అందుబాటులోకి తేవాలి.

సకాలంలో ఫిర్యాదులు పరిష్కారం, సమాచారం అందించినప్పుడు మున్సిపల్ కమిషనర్‌నీ, బాధ్యులైన సిబ్బందినీ పూల గుచ్ఛాలతో సత్కరించండి. సకాలంలో సేవలు అందించకపోతే ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించండి. ఈ కార్యకలాపాలు సురాజ్య కమిటీ ఆమోదంతో నిర్వహించాలి.

**3. మన ఊళ్లో మానవాభివృద్ధి :** దీని కోసం సురాజ్య కమిటీ ఒక కన్వీనర్‌నీ వలంటీర్ల బృందాన్ని రూపొందించాలి. ఈ బృందం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో సిబ్బంది, వసతుల కొరతలపై సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందిస్తుంది. సురాజ్య కమిటీ ఈ సమస్య పరిష్కారానికి తగిన మెమోరాండాలు, సంబంధిత అధికారులతో చర్చలు సాగించాలి.
అలాగే ఈ బృందం ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సేవలు, అంగన్‌వాడీల మీద సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించాలి. తక్షణ సమస్యలపై సురాజ్య కమిటీ స్పందించాలి.
యువతకు ఉపాధి పథకాల అమలు శిక్షణా కార్యక్రమాల ఏర్పాట్ల పై సర్వే నిర్వహించాలి. యువతతో ప్రత్యేక రౌండ్‌టేబుల్స్ నిర్వహించి ఈ అంశాలను చర్చించాలి. పథకాలలో అవినీతి వుంటే దానిని "జన లోకాయుక్తకు" నివేదించాలి.

ఇవన్నీ సురాజ్యం పేరుతో నిరంతరాయంగా సాగించాల్సిన కార్యక్రమాలు. దీనికి వలంటీర్లు, శిక్షణ అవసరం అందుకు విస్తృత ప్రచారం చెయ్యాలి. ప్రతి కాలేజీలో, ప్రతి పౌరసేవా సంస్థలో వలంటీర్ల నమోదుకు ఏర్పాట్లు చెయ్యాలి. వలంటీర్లను పైన పేర్కొన్న విధంగా ఐదు బృందాలు చేసి వారికి నిర్దిష్టంగా కార్యక్రమాలను అప్పగించాలి.

## IV సురాజ్య నిధి - ఇతర వసతులు

స్థానికంగా ప్రచారానికి, సభలు సమావేశాల నిర్వహణకీ అవసరమైన నిధులను సురాజ్య కమిటీ సేకరించాలి. సురాజ్య కమిటీ, ప్రజా మున్సిపల్ కౌన్సిల్, జన లోకాయుక్తలలోని సభ్యుల నుంచి ఎంతో కొంత మొత్తం అడిగి తీసుకోవాలి. సురాజ్యఉద్యమానికి తోడ్పాటునిచ్చే దాతల నుండి ప్రతి పట్టణంలో నిధులు సేకరించుకోవాలి. వీటి జమాఖర్చుల నిర్వహణకు కోశాధికారిని ఏర్పాటు చేసుకోవాలి. జమాఖర్చులు ప్రతి సురాజ్య కమిటీ సమావేశంలో ప్రకటించాలి.

## V సురాజ్య ఉద్యమంలో యువతని, మహిళలనీ, భాగస్వాములను చెయ్యడానికి ప్రత్యేక చర్చలు

**1. విద్యార్థులు, యువతతో రౌండ్‌టేబుల్ :** వివిధ కాలేజీల నుండి విద్యార్థులను, వివిధ యువజన సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి ఒక రౌండ్‌టేబుల్‌ను ప్రత్యేకంగా నిర్వహించి వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి. అన్ని కాలేజీలలోనూ విద్యార్థులతో చర్చాగోష్ఠులు, ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించాలి.

**2. మహిళా రౌండ్‌టేబుల్ :** మహిళా టీచర్లు, లాయర్లు, డాక్టర్లు – మహిళాసంస్థలు– పొదుపు సంఘాల నాయకులను ఆహ్వానించి మహిళలకు ఒక ప్రత్యేక రౌండ్‌టేబుల్‌ను నిర్వహించి – ఇందులో వలంటీర్ల నమోదు – వివిధ కార్యకలాపాల బృందాలలో ఆసక్తిగల వారికి బాధ్యతలు అప్పగించాలి – ప్రజా వార్డు కౌన్సిలర్లుగా ఆసక్తి వున్నవారిని గుర్తించి వారికి అవకాశం కల్పించాలి.

**పట్టణ సురాజ్య కమిటీలు ప్రతివారం సమావేశమై ఈ కార్యకలాపాలను సమన్వయం చెయ్యాలి.**

## VI అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం : సురాజ్యం మార్చ్

డిశంబర్ 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం ప్రతి పట్టణంలోనూ నిర్వహించాలి. ( మీ పట్టణంలో స్థానిక విద్యాసంస్థల వీలునుబట్టి ఒకరోజు అటు ఇటూగా) అన్ని విద్యాసంస్థలతో ముందుగానే సంప్రదించుకుని వేలాదిమందితో సురాజ్య మార్చ్ నిర్వహించాలి. ఇప్పటినుంచి సురాజ్య మార్చ్‌కు సన్నాహాలు చేయవలసిందిగా కోరుతున్నాం. ◆






# సురాజ్య లక్ష్యం కోసం సమష్టిగా పనిచేద్దాం

## మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు




సురాజ్య ఉద్యమంపేరుతో లోక్‌సత్తా ప్రవేశపెట్టిన ఉద్యమంలో మనమంతా సమష్టిగా పనిచేద్దామని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. ఓటు, డబ్బు మధ్య అపవిత్ర బంధం వచ్చింది. ప్రజల్లో చైతన్యానికి బదులుగా వ్యక్తిగత స్వార్ధం ప్రబలిపోయి తాత్కాలిక ప్రయోజనాలకు పరిమితమౌతున్నారు. వ్యవస్థల్లో పారదర్శకతకు ఏర్పాటు జరగనంతకాలం అవినీతి జాడ్యం పోదు. బడి నుంచి, కళాశాల నుంచి ఈ మార్పుకు శ్రీకారం చుట్టాలి. బాధ్యత గల పౌరుడిగా సురాజ్య లక్ష్యాలకై మీతో చేయికలిపి ఉద్యమిస్తాను.

డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ మార్పు రావాలి. దీనిపై అందరూ ఏకాభిప్రాయానికి వచ్చాం. మార్పు లేకున్నా బ్రతుకుతాం కానీ సంతృప్తిగా ఆనందంగా బ్రతకడం సాధ్యం కాని స్థితి. ఆమోదయోగ్యమైన ఉమ్మడి లక్ష్యాలమేరకు మనసు పెట్టి పనిచేస్తే మంచిమార్పు సాధ్యమే. యువత చాలా మంచి ఆకాంక్షలతో వున్నారు. వాళ్లను దిశానిర్దేశం చేస్తే మార్పు వేగవంతం అవుతుంది. ఆ ప్రయత్నం చేద్దాం.

రాష్ట్ర సురాజ్య ఉద్యమ బాధ్యులు డి.వి.వి.యస్. వర్మ, వై.డి రామారావు, పాలడుగు సుబ్రహ్మణ్యం, తదితరులు మాట్లాడారు. మన ఊళ్లో సురాజ్యం పేరుతో స్థానిక మోడరన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, కొమరిన వీర్రాజు, మోడరన్ అధినేత జి.వి.రావు, లోక్‌సత్తా ఉద్యమ జిల్లా సమన్వయకర్త ఉప్పలపాటి మాచిరాజు, చెలంకూరి నాగేశ్వరరావు, చిలుకూరి సత్యనారాయణ, వి.వి. రామారావు, ఎం.వి. రమణమూర్తి, పట్టాభి రామారావు, కాకుళవరపు రామచంద్రరావు, బి.వి.బి.ఎల్. నారాయణ, బిక్కిన వెంకటేశ్వరరావు, మార్ని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమానికి సన్నద్ధం కావాలి

## లోక్‌సత్తా నాయకులు డి.వి.వి.యస్. వర్మ




**ఒంగోలు**

సమాజాభివృద్ధి కోసం సురాజ్య ఉద్యమానికి సన్నద్ధం కావాలని సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు డివివియస్ వర్మ పిలుపునిచ్చారు. స్థానిక కళ్యాణి కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల సురాజ్య ఉద్యమ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు నిర్ధిష్టమైన లక్ష్యాలతో ముందుకు వెళ్లకపోవడంతో దేశం వెనుకబడి పోయిందన్నారు. పార్టీలు ఎన్ని ఉన్నా ప్రభుత్వం మనందరిది అనే విషయాన్ని గ్రహించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్య, వైద్య, ప్రజలకు భద్రత, మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడి పోయామన్నారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులను కూడా విస్మరించాయని విమర్శించారు. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు మెరుగైన పాలన కోసం సురాజ్య ఉద్యమం ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు.

లోక్‌సత్తా నాయకులు కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వాలు పాటుపడాల్సి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉన్న వనరులను కూడా సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు పరిశ్రమలు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. మౌలిక సదుపాయాలు ఎక్కడ ఉంటాయో అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారన్నారు. ఆ విధంగా సదుపాయాల కల్పనలో వెనుకబడి ఉన్నామన్నారు. రాష్ట్రంలో ఈ పరిస్థితులు ఎందుకు వచ్చాయో ప్రజలకు వివరించి, ఉద్యమాల్లో భాగస్వామ్యులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకపోవడంతో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. విద్యారంగంలో దేశం వెనుకబడి ఉందన్నారు. విద్య ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందనే విషయాన్ని గ్రహించాలని ఆయన పేర్కొన్నారు.

ఉద్యమ నాయకురాలు యస్. మనోరమ మాట్లాడుతూ ఉన్నత విద్య ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలో పెరిగి పోయిన అవినీతిని అంతమొందించేందుకు సురాజ్య ఉద్యమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులు చేయాలని కోరారు. దేశంలో పెరిగిపోయిన అవినీతితో సామాన్యులకు కనీస సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.

లోక్‌సత్తా నాయకులు అల్లు శివరమేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో బాబురావు, ఎం.ఎన్. ప్రసాద్, లుకా, సత్తార్, సురేష్, శ్రీనివాసరావు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సురాజ్యంపై సంక్షిప్త దృశ్య నివేదకను పద్మభూపతిరాజు ఇచ్చారు.

# సురాజ్య ఉద్యమ లక్ష్యాలపై విస్తృత ప్రచారం

## లోక్‌సత్తా నాయకులు కటారి శ్రీనివాసరావు




### విజయనగరం

సురాజ్య ఉద్యమ లక్ష్యాలు వాడవాడలా విస్తరించేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని కమిటీ సభ్యులంతా సైనికుల్లా పనిచేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఐఎంఎ హాలులో సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందన్నారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ రూపొందించిన సురాజ్య క్యాలెండర్‌లోని కార్యక్రమాలను నవంబర్ 26 వరకూ నిర్వహించాలని సూచించారు. సురాజ్య పోరాటం రాజకీయాలకు అతీతంగా చేపట్టిన ఉద్యమమని తెలిపారు. సురాజ్య ఉద్యమ కమిటీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బరాటం కామేశ్వరరావు, విజయనగరం కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, విశాఖపట్నం కమిటీ అధ్యక్షులు ఐఎం అహ్మద్, ప్రజాగాయకుడు వంగపండు ఉద్యమ కమిటీ కార్యవర్గ సభ్యులు, పివివి గోపాలరాజు, విష్ణుమూర్తి, జిల్లా కన్వీనర్ తేజో కల్యాణ్ పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమాన్ని సాగిద్దాం

### తణుకు

సమాజంలోని ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా సురాజ్య ఉద్యమం ప్రారంభించినట్టు సురాజ్య ఉద్యమ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.వి.వి.యస్. వర్మ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల సురాజ్య ఉద్యమ కమిటీల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరికి ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించాలన్నారు. ప్రజలు నివసించే చోటే పరిపాలన ఉండాలని చెప్పారు. అవినీతిలేని పౌర సేవలందించాలన్నారు. అవినీతిపరులను శిక్షించేందుకు బలమైన లోకాయుక్త చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మన ఊరిలో మనం ఉన్నచోట సమస్యలకు తక్షణ పరిష్కారం జరగాలని చెప్పారు. మన ఊళ్ళో సురాజ్యం అనే విషయాన్ని ప్రజల్లో తీసుకెళ్ళడానికి ప్రజా మునిసిపల్ కౌన్సిల్ స్థాపించాలని చెప్పారు. అన్ని విద్యా సంస్థల్లోనూ, స్వచ్ఛంద సంస్థల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వై.డి. రామారావు, భూపతి రాజు పద్మ, చిట్టూరి సుబ్బారావు, డా॥ తాతిన రామబ్రహ్మం, ఎన్.మనోరమ, కటారి శ్రీనివాసరావు, అల్లూరి సీతారామారాజు, చిక్కా భీమేశ్వర్‌రావు, సదానందమూర్తి, డా॥ చంద్రమౌళి, సిద్ధార్ధ బక్ష్, విజయలక్ష్మి, డాక్టర్ రమేష్ చంద్రబాబు, తణుకు, భీమవరం, నరసాపురం ఏలూరు, గొల్లపాలెం రామచంద్రపురం, అమలాపురం పట్టణాల నాయకులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమమే శరణ్యం

- బరాటం కామేశ్వర్‌రావు



## 60 అడుగుల జాతీయ పతాకంతో ప్రదర్శన

**శ్రీకాకుళం**

సురాజ్య సాధనకు ఉద్యమమే శరణ్యమని పలువురు వక్తలు అన్నారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని నేషనల్ సైన్స్ కళాశాల వద్ద సమావేశం జరిగింది. ఈ సభలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు కె.పోలినాయుడు మాట్లాడుతూ సురాజ్య స్థాపనకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాది రాంబాబు మాట్లాడుతూ అవినీతిపరుల భరతం పట్టేందుకు కొత్త లోకాయుక్త చట్టం ఒక్కటే మార్గమని అందుకోసం యువత సిద్ధపడాలని కోరారు. సురాజ్య ఉద్యమ కమిటీ కన్వీనర్ బరాటం కామేశ్వరరావు మట్లాడుతూ అవినీతి లేని పాలన, అందరికి ఎదిగే అవకాశాల కోసం సురాజ్య ఉద్యమానికి ప్రజలంతా కలసి రావాలని ఆకాంక్షించారు. ఎందరో త్యాగధనుల కృషి ఫలితంగా సాధించుకున్న స్వరాజ్యం స్వాహారాజ్యంగా మారిందన్నారు. దీనిని మార్చేందుకు ప్రజలు నడుం బిగించాలన్నారు. అనంతరం 60 అడుగుల త్రివర్ణ జాతీయ పతాకంతో కళాశాల విద్యార్థినీ విద్యార్థులు కాలేజీ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సురాజ్య ఉద్యమగోడ పత్రికను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సురాజ్య ఉద్యమ నాయకులు కె.ముఖేష్‌బాబు, వై.మురళి, జి.సోమేశ్వరరావు, కె.దివాకర్, నేషనల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, లోక్‌సత్తా కోశాధికారి పి.అప్పలరాజు తదితరలు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారం కోసమే ప్రజాకౌన్సిల్

## లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్‌రావు




**కదిరి**

మున్సిపాలిటీలో ప్రజా సమస్యలను విషయ పరిజ్ఞానంలో సంఘటితంగా ఉద్యమించి పరిష్కరించడానికే ప్రజా కౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నామని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్ రావు అన్నారు. అనంతపురం జిల్లా కదిరి పట్టణంలో అక్టోబర్ 28వ తేదీన జరిగిన రాష్ట్రంలో మొదటి సారి ఏర్పడిన ప్రజాకౌన్సిల్ ఆవిర్భావ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

గత రెండేళ్ళుగా మున్సిపల్ ఎన్నికలను రాష్ట్రంలో ప్రభుత్వం వాయిదా వేస్తుందని ప్రజా ప్రతినిధులు లేకుండా పాలన ఎలా సాగుతుందని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి సురాజ్య ఉద్యమ పట్టణ కన్వీనర్ మన్సూర్‌భాషా అధ్యక్షత వహించగా కార్యదర్శి మొహమ్మద్‌సల్మా స్వాగతోపన్యాసం చేశారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పౌరసమాజం, ఎన్నికైన మాజీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, చైర్‌పర్సన్స్, మేయర్లతోపాటు ప్రతి వార్డుకి ఇద్దరి చొప్పున సురాజ్య ప్రజా కౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నామని రామ్మోహన్‌రావు వివరించారు. ప్రతి వార్డు నుండి ఒక మహిళ, మరొక యువకుడిని ఈ కమిటీలోకి తీసుకుంటున్నారు. కదిరిలోని 36 వార్డులలో కమిటీ పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను కలిసి పనిచేస్తామని కదిరి ఇంచార్జ్ రెడ్డప్ప, హేమంత్‌లు తెలిపారు. ఎప్పటికప్పుడు పారిశుధ్యం, మురుగు, మంచినీరు, మౌలిక వసతుల విషయంలో మున్సిపల్ కమీషనర్‌తో కలసి ప్రజలలో పర్యటిస్తామని కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా కౌన్సిల్ కన్వీనర్, సామాజిక సేవకుడు నారాయణ, టీచర్ రజనలను కో కన్వీనర్‌గా ఎన్నుకున్నారు.

# ప్రజా ఉద్యమంగా సురాజ్యం




**రాయదుర్గం**

సురాజ్య ఉద్యమాన్ని ప్రజాఉద్యమంగా మారుస్తామని లోక్‌సత్తా నాయకులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సురాజ్య ఉద్యమ పోస్టర్లను లోక్‌సత్తా పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించడం ద్వారా మానవాభివృద్ధికి స్వతంత్ర జీవనాన్ని సుసాధ్యం చేయాలన్నదే సురాజ్య ఉద్యమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

పార్టీల కతీతంగా ఉద్యమానికి సహకరించి అవినీతి రహిత పాలన, అందరికీ ఎదిగే అవకాశాల కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అబ్దుల్లా, లోకేష్, ఫణిభూషన్, చంద్ర, దాదు, కుమార్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

# సురాజ్యం మరో స్వాతంత్ర్య పోరాటం

## లోక్‌సత్తా నాయకులు వై.డి. రామారావు




సురాజ్య ఉద్యమం ద్వారా రాష్ట్రంలో మరో స్వతంత్ర్య ఉద్యమానికి బీజం పడనుందని రాష్ట్ర సురాజ్య ఉద్యమ సమన్వయకర్త, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైడి రామారావు పేర్కొన్నారు. కాజులూరి మండలం గొల్లపాలెం పెన్షనర్స్ హోమ్‌లో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవు సదానందమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. లోక్‌సత్తా పార్టీ, ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం అధ్వర్యంలో పార్టీలకు అతీతంగా చేపట్టిన సురాజ్య ఉద్యమం ద్వారా అన్ని వర్గాల ప్రజల హక్కులపై చైతన్యం కలిగించనున్నట్లు తెలిపారు. ఏడాదికి రూ॥లక్షా 47వేలకోట్ల రాష్ట్ర బడ్జెట్ కలిగిన మన రాష్ట్రంలో ఎక్కువ శాతం నిధుల్ని ప్రభుత్వం నిరుపయోగంగా ఖర్చు చేస్తోందన్నారు. సగటున ఒక మనిషికి సంవత్సరానికి రూ॥17వేల ఖర్చు చేస్తున్న ప్రభుత్వం వాటిలో రూ॥ఒక్కవెయ్యి నేరుగా గ్రామస్థాయిలో ఖర్చు చేసేందుకు ప్రకటిస్తే వాటి ద్వారా స్థానిక గ్రామాభివృద్ధితోపాటు సమస్యలు పరిష్కార మవుతాయన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా మన దేశంలో కూడా దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ విధానం వల్ల ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీ, దౌర్జన్యాలు అంతమవుతాయని అభిప్రాయపడ్డారు. సామాన్యుల్లో దాగి ఉన్న నిజమైన ఆకాంక్షను సురాజ్య ఉద్యమం ద్వారా బయటకు తీసి ప్రజల్లో చైతన్యాన్ని నింపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దేవరపల్లి రామకృష్ణ, బిరుదా సత్యనారాయణ, గొల్లపల్లి గంగారావు, పెల్లెపు అప్పారావు, అబ్దుల్ రహమాన్, దేవు భగవాన్, రమేష్ కుమార్, పీవీవీ సత్యనారాయణ, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

**కాజులూరు**

# సురాజ్య ఉద్యమం చేపట్టాలి : పి.వి. రావు



వివిధ అవినీతి కుంభకోణాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిండుగా కూరుకుపోయిన ఈ సమయంలో సురాజ్య ఉద్యమం ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. లోక్‌సత్తా నాయకులు పగడాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన సురాజ్య ఉద్యమంపై రవీంద్ర మండపంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ సేవలను హక్కుగా పొందే అవకాశాన్ని కల్పించే చట్టం అమల్లోకి వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థలకు విధులు, నిధులు కేటాయించి పూర్తి అధికారాలు కల్పించాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో లోక్‌పాల్, రాష్ట్ర స్థాయిలో లోకాయుక్త జిల్లాస్థాయిలో అంబుడ్స్‌మెన్ ఏర్పాటు చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, జనచైతన్య వేదిక అధ్యక్షులు బి.దుర్గారావు, గ్రేటర్ హైదరాబాద్ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, వికారాబాద్ పట్టణ అధ్యక్షులు కె.సత్యనారాయణ, ఎం.నర్సింహారెడ్డి, జాకీర్ మొయినుద్దీన్, బి.లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై సురాజ్య సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పక్షాలు, పార్టీలకు చెందిన ప్రతినిధులు సి.నాగరాజు, తరుణ్, గాలి వసంతకుమార్, సి.జగదీష్, ఎర్రవల్లి జాఫర్, లక్ష్మణ్ తదితరులు వివిధ అంశాలపై చర్చించారు.

**వికారాబాద్**

# సురాజ్యంలోనే చేతి వృత్తులకు భద్రత : భానుప్రసాద్



డబ్బులు లేక తగిన వైద్యం అందక ఏ వ్యక్తి మరణించకూడదని, కుటుంబాలు అప్పుల పాలు కాకూడదని, పుట్టిన ప్రతిబిడ్డకు డబ్బుతో, కులంతో, పేదరికంతో నిమిత్తం లేకుండా మంచి ప్రమాణాల విద్యతో ఎదిగే అవకాశం కల్పించినప్పుడే నిజమైన సురాజ్యమని పట్టణ సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ సభ్యులు యూనస్ అన్నారు. పట్టణంలోని బాపు వృద్ధుల ఆశ్రమంలో సురాజ్య ఉద్యమ అవగాహనా సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యూసఫ్ పాల్గొని మాట్లాడారు. సురాజ్య ఉద్యమ కన్వీనర్ మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ సురాజ్యమంటే పేదలకు చేతి వృత్తుల వారికి తగిన భద్రత కల్పించటమేనన్నారు.

**చిలకలూరిపేట**

అందుకోసం చేతివృత్తుల వారు సురాజ్య ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులు షేక్ సాదిక్ ఆరాధ్యుల రామకృష్ణ, మల్లెల ఆంజనేయులు, మురికిపూడి ప్రసాద్, బూరగ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అంతానికి కదలండి : టి.ఆర్. జగన్నాధరెడ్డి



దేశంలో పెచ్చు పెరిగిపోతున్న అవినీతి అంతానికి యువత ముందుకు రావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు టీ.ఆర్.జగన్నాధ రెడ్డి, విద్యాసత్తా రాయలసీమ సమన్వయకర్త శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కంకరగుర్రెడ్డి డిగ్రీ కళాశాలలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో సురాజ్య ఉద్యమంలో భాగంగా విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోజు రోజుకీ అవినీతి ఎక్కువై పోతోందన్నారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అవినీతిఅంతం కోసం చేస్తున్న పోరాటాన్ని గుర్తుచేశారు. అనంతరం స్థానిక పింఛనర్ల సంఘం అధ్యక్షుడు పి. సంజీవరెడ్డి,

**బనగానపల్లి**

న్యాయవాది టి. మాధవరెడ్డి, బీసీ సంఘం నాయకులు శ్రీరాములు, మాజీ సర్పంచి లక్ష్మీరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సదాశివమూర్తి, న్యాయవాది హరికృష్ణారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

# సుపరిపాలనకు సురాజ్య ఉద్యమం

## లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్‌రావు



**ఆదోని**

అవినీతిలో కూరుకుపోయిన నేటి రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయని సుపరిపాలన కోసం సురాజ్య ఉద్యమం అవసరమే ర్పడిందని టిడిపి కర్నూలు పార్లమెంట్ ఇంచార్జ్ బి.టి.నాయుడు, సురాజ్య ఉద్యమ రాష్ట్ర నేత బండారురామ్మోహన్‌రావులు అన్నారు. ఆర్ట్స్ కళాశాల రహదారిలోని మోర్ మార్కెట్ కింద హాలులో అన్ని రాజకీయ రాజకీయేతర పార్టీల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఓటుకు నోటు, మద్యం సంస్కృతి అవినీతిని ప్రోత్సహిస్తోందన్నారు. సుపరిపాలన కోసమే సురాజ్య ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు9న మొదలు పెట్టి డిసెంబర్9 వరకు జరుపుతున్నామన్నారు. స్వరాజ్యంలో కొత్త విలువలు, విలువలు గల రాజకీయం, శ్రమతో కూడిన సంపద, నీతిగల వ్యాపారం మానవత్వం గల శాస్త్రం, ఆత్మసాక్షిగా ఆనందం అన్న అంశాల పై ప్రముఖులు ప్రసంగించారు. అవినీతి అంతమొందించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, సురాజ్య ఉద్యమం పోరాటంతోనే అది సాధ్యమవుతుందని అందరు భాగస్థులు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త యగ్గటి ప్రతాప్, కన్వీనర్ యగ్గటి మహదేవప్ప, కో కన్వీనర్, టిడిపి తెలుగు యువత భూపాల్‌చౌదరి, ప్రచార కార్యదర్శి గోపాల్ రెడ్డి, పిఆర్‌పి మల్లప్ప, ఆవాజ్ కమిటీ నాయకులు బషీర్‌అహమ్మద్, ఏబివిపి శ్రీనివాసాచారి, న్యాయవాదులు నాగేంద్రయ్య, డాక్టర్ కృష్ణగోపాల్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రసాదరావు, సిటిజన్ వెల్ఫేర్ ఇండియా నాయకులు వెంకటరెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆదోనిలో సురాజ్యం ఫ్లెక్సీలు




సురాజ్య ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళడానికి కర్నూలు జిల్లా అదోనిలో సురాజ్య ఉద్యమ స్లొగన్లు ప్రచారం చేయడానికి స్థానిక సురాజ్య ఉద్యమ నాయకులు మావా దేవప్ప ఆధ్వర్యంలో ఒక మంచి ప్రయత్నం జరిగింది. పట్టణంలో రైల్వేస్టేషన్, బస్టాండ్ మొదలుకొని ముఖ్యమైన 35 కూడళ్లలో సురాజ్య ఉద్యమ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదోనిలో అక్టోబర్ 27న రౌండ్‌టేబుల్ సందర్భంగా పట్టణం అంతా సురాజ్య ఉద్యమ ఫ్లెక్సీలతో నిండిపోయింది. ఈ బ్యానర్ ఏర్పాటులో మహ దేవప్పతో పాటు విష్ణుమల్లీకార్జున, యువ న్యాయవాది యశశ్వ తదితరులు పాల్గొన్నారు.

**సురాజ్య ఉద్యమ నిధికి దేశాయ్ విరాళం**

అదోని పట్టణంలోని ప్రముఖన్యాయవాది జి.వి.దేశాయ్ సురాజ్య ఉద్యమ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. సురాజ్య ఉద్యమ నిధికి ఆయన మొదటి విరాళంగా మూడు వేల రూపాయలను కన్వీనర్ మహ దేవప్పకు అందజేశారు. దానితో సురాజ్య ఉద్యమ నిధికి శ్రీకారం చుట్టారు.



శ్రీకాకుళంలో సురాజ్య ఉద్యమం



కాకినాడలో సురాజ్య ఉద్యమం



బనగానపల్లిలో సురాజ్య ఉద్యమం